క్లుప్తంగా

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి



సూర్యకుమారిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు (మెట్రో) : జిల్లా పరిషత్ చైర్మన్‌గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు మరింతగా ప్రజలకు చేరువ కావాలని అన్నారు. జిల్లా అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు ఘంటా ప్రసాదరావు ఉన్నారు.

శ్రీపర్రు ఉపసర్పంచ్‌గా జ్యోతి



నియామక పత్రం అందుకుంటున్న జ్యోతి

ఏలూరు రూరల్ : శ్రీపర్రు పంచాయతీ ఉపసర్పంచ్‌గా పేరం జ్యోతి ఎన్నికయ్యారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ 12 మంది వార్డు సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 11 వార్డు సభ్యుడు పాగుర్ల జయనేంద్ర ఉపసర్పంచ్ జ్యోతి పేరును పేర్కొనగా సభ్యులు బలపరిచారు. దీంతో జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సరళకుమారి ప్రకటించి ధ్రువీకరణపత్రం అందజేశారు. ఏడాది క్రితం గురిందల కనకరాజు రాజీనామాతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

నగరంలో దొంగల హల్‌చల్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో రాత్రివేళల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇద్దరు దొంగలు మోటారు సైకిల్‌పై నగరంలో తిరుగుతూ పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వీరిద్దరూ అనుమానాస్పదంగా కనిపించటంతో నైట్‌బీట్ సిబ్బంది వారిని పట్టుకున్నారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ ఆధ్వర్యంలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వారిద్దరూ అమీనాపేట పోలీసుల రామాలయం హుండీ, గ్జేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్ చర్చి హుండీ పగులగొట్టి నగదు కాజేసినట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పథంలో మార్కెట్‌యార్డ్

- రూ.4 కోట్లతో జెంబోషెడ్డు పనులు
- రూ.35 లక్షలతో సోలార్ సిస్టం
- ఏడాదికి రూ.1.40 కోట్ల వ్యాపారం



మార్కెట్‌యార్డ్‌లో జరుగుతున్న నిమ్మకాయల అమ్మకాలు





ఏలూరు మార్కెట్‌యార్డ్‌లో చేపట్టిన జంబోషెడ్డు పనులు, రైతులు యార్డ్‌కు తరలించిన అరటిగెలలు

ఏలూరు రూరల్ : ఏలూరు మార్కెట్‌యార్డ్‌కు కొత్త శోభ సంతరించుకోనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన జంబోషెడ్డు నిర్మాణం పాలకవర్గం ప్రారంభించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. సుమారు 100 మీటర్ల పొడవైన జంబో షెడ్డు రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. సుమారు 20 మీటర్ల ఎత్తు ఉండే ఈ షెడ్డులో రైతులు పెద్ద ఎత్తున నిమ్మకాయలను భద్రపరుచుకోవచ్చు. గాలి, దుమ్ము, ఎండ, వాన సైతం తట్టుకునేలా దీన్ని నిర్మించనున్నారు.

రూ 35 లక్షలతో సోలార్ సిస్టం

మార్కెట్‌యార్డ్‌లో విద్యుత్ ఆదాపై పాలకవర్గం దృష్టి నిలిపింది. ఏటా చెల్లిస్తున్న విద్యుత్ బిల్లుల మొత్తాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఇందుకోసం సౌర విద్యుత్ సిస్టమ్ ఏర్పాటుచేయాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్ శాఖ అధికారులతో యార్డ్ అధికారులు మంతనాలు జరిపారు. ఇందుకు సుమారు రూ.35 లక్షలు ఖర్చు పెట్టాలని భావిస్తున్నారు. దీనివల్ల లక్షలాది రూపాయల విద్యుత్ బిల్లు ఆదా కావడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అంటున్నారు.

వ్యాపారం వృద్ధి

జెంబోషెడ్డు అందుబాటులోకి వస్తే యార్డ్‌లో వ్యాపారం మరింత విస్తరిస్తుందని రైతులు భావిస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద నిమ్మకాయల యార్డ్‌గా పేరొందడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద వ్యాపారుల రాక ఇంకా పెరిగి రైతులకు మేలు జరుగుతుందంటున్నారు. ఇప్పటికే 50 మందికి పైగా వ్యాపారులు ఏడాది పొడవునా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. వేసవికాలంలో రోజుకు 600 నుంచి 800 టన్నుల ఎగుమతి చేస్తుండడం విశేషం. మే నెలలో ఎన్నడూ లేని విధంగా రోజుకు 1300 టన్నుల నిమ్మకాయలు ఎగుమతి చేసి రికార్డు సృష్టించారు. ఏటా మార్చి 15వ తేదీ నుంచి జూన్ 15 వరకూ వేసవికాలం మూడునెలలు సుమారు రూ 1.40 కోట్ల నిమ్మ వ్యాపారం జరుగుతుంది.

ఎమ్మెల్యే ఆళ్ళ నాని కృషి ఫలితమే



మార్కెట్‌యార్డ్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆళ్లనాని ఎంతో కృషి చేస్తున్నారు. జంబోషెడ్డు, కమ్యూనిటీ మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆయన చేతుల మీదగానే జంబోషెడ్డు ప్రారంభిస్తాం. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.7 లక్షల 49 వేలు ఖర్చు పెట్టి హమాలీలకు యూనిఫారం అందించాం.

– నెరుసు చిరంజీవులు, ఏఎంసీ చైర్మన్

మరింత అభివృద్ధి చేస్తాం



ప్రభుత్వం, పాలకవర్గం తీర్మానాలను అనుసరించి యార్డ్ అభివృద్ధి పనులు చేపట్టాం. జంబో షెడ్డు నిర్మాణం సాధ్యమైనంత వేగంగా పూర్తి చేస్తాం. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నిమ్మకాయలు, పండ్లు, అరటిగెలలు పెద్ద ఎత్తున భద్ర పరుచుకోవచ్చు. అమ్మకాలపై ఏడాదికి రూ 1.40 లక్షలు యూజర్ చార్జి వసూలు చేస్తున్నాం. ఈ నిధులతో పాలన వ్యవహారాలు చేస్తున్నాం.

– కె శారదరాణి, కార్యదర్శి

సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల కృతజ్ఞతలు



దిరిశాల వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆళ్ల నాని తదితరులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోనే మొదటిసారిగా ఏలూరులో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్‌లకు కృష్ణ అభిమానులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అభిమాన సంఘం నాయకులు ఆళ్ల నానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విగ్రహం ఏర్పాటులో ఎంతో సహకారం అందజేసిన దిరిశాల వరప్రసాద్‌ను ఆళ్ల నాని చేతులమీదుగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ బాబు రూపొందించిన అగ్గిపుల్లపై కృష్ణ జమదగ్ని ప్రతిబింబాన్ని ఆయనకు బహూకరించారు. సూపర్‌స్టార్ కృష్ణ ఏలూరులో చదువుకున్నందుకు గుర్తుగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఏలూరులో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు కృష్ణ అభిమానులు ఈ సందర్భంగా తెలియజేశారు.

నగరాభివృద్ధికి సిబ్బంది చిత్తశుద్ధితో కృషిచేయాలి



సిబ్బందితో సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రాధా

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధా అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఆస్తి పన్ను, నీటి పన్ను, నగరపాలక సంస్థ షాపుల అద్దెలు ఇతర బకాయిలను, ప్రస్తుత పన్నులను సకాలంలో వసూలు చేసి నగర అభివృద్ధికి మీ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. ఏలూరు నగరపాలక సంస్థలో వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో శానిటేషన్ పర్యవేక్షణకు అదనపు బాధ్యతలు అప్పగించారని, సిబ్బంది సరైన విధానంలో శానిటేషన్‌పై దృష్టి సారించాలని చెప్పారు. క్లాప్ యూజర్ ఛార్జీలు వసూలు చేసేందుకు సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ క్షేత్రస్థాయిలో శానిటేషన్ సిబ్బందితో కలిసి పర్యటిస్తూ క్లాప్ యూజర్ చార్జీలు వసూలు నూరుశాతం సాధించాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

హమాలీలకు 15 శాతం కూలి రేట్ల పెంపు



కూలి రేట్ల పెంపు అనంతరం నినాదాలు చేస్తున్న హమాలీలు, నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరులోని వివిధ షాపులలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు 15 శాతం కూలి రేట్లు పెంచారు. స్థానిక మర్చంట్ చాంబర్‌లో ఐఎఫ్‌టీయు, ఏఐటీయూసీ మధ్యవర్తిత్వంలో వ్యాపారులు, హమాలీలకు శుక్రవారం జరిగిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. గతంలో జరిగిన కూలిరేట్ల ఒప్పందం ఈ ఏడాదిఏప్రిల్ 9 తో ముగిసింది. అంతకుముందు ఏఐటీయూసీ అనుబంధ జట్లు, లాగుడు బండ్ల కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏలూరు హమాలీ జట్టు కార్మిక సంఘం విడివిడిగా ఛాంబర్ నాయకత్వానికి నోటీసులు ఇచ్చారు. దీనిపై కొంత ఆలస్యంగా నిర్వహించిన జాయింట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు పి.కన్నబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు గడసాల రాంబాబు మాట్లాడుతూ మొదట ఆలస్యం చేసినప్పటికీ చివరికి యజమానులు సామరస్యంగా ఒప్పందానికి ముందుకు వచ్చారన్నారు. ఈ ఒప్పందం సాధించుకోవడంలో సహకరించిన ఇరు సంఘాల కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ చర్చల్లో ఛాంబర్ తరుపున అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర, ఉపాధ్యక్షుడు దింటకుర్తి వీర్రాజు, కార్యదర్శి వంకాయల రామకృష్ణ, వ్యాపారస్తులు బుర్రంశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొనగా కార్మికుల తరపునా ఐఎఫ్‌టీయూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు, మారిన వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, జట్లు లాగుడు బండ్ల కార్మిక సంఘం కార్యదర్శి వంగలపూడి గంగరాజు, కోశాధికారి పెచ్చెట్టి శ్రీను, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆ కళాశాలను సీజ్‌చేయాలని నిరసన



ప్లకార్డులతో పీడీఎస్‌యూ నాయకుల నిరసన ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న ఏలూరు ఎన్ఆర్‌పేట ఉన్న శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటదిబ్బ డిగ్రీ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాకి నాని మాట్లాడుతూ శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలకు ముందస్తు అనుమతులు లేకుండా ఎస్‌వీఆర్‌కే కళాశాల యాజమాన్యం బోర్డులు తగిలించి అడ్మిషన్లు చేస్తున్నా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్ బాబు సక్రమంగా స్పందించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 4వ తేదీన కళాశాల యాజమాన్యానికి షోకాజు నోటీస్ అందినా ఇంకా అడ్మిషన్లు కొనసాగిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ ప్రైవేటు యాజమాన్యానికి తొత్తుగా మారిన ఆర్ఐఓను ఆ పదవి నుంచి తొలగించాలని ఉన్నతాధికారులను కోరారు. అలాగే ఇప్పటికే త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో కాలేజీల అఫిలియేషన్ కోసం చేస్తున్న విచారణలో అనేక అవకతవకలకు పాల్పడుతూ ప్రతి కాలేజీ నుంచి దాదాపు రూ. 30 నుంచి 35 వేలు వసూలు చేస్తున్నట్లు అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిపైన కూడా విచారణ చేయాలని నాని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, నగర కమిటీ సభ్యుడు సీహెచ్.దుర్గాప్రసాద్. డిగ్రీ కాలేజీ కమిటీ సభ్యులు టీ.సునీల్, ఎం. బాలరాజాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీ పాటల పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు తెలిపారు. శుక్రవారం స్థానిక గవరవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం 10 గంటల నుంచి పాటల పోటీలు ప్రారంభమౌతాయన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు నగర ప్రముఖుల చేతులపై జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. పోటీల అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో పాడనా తీయగా పేరిట త్వరలో చేపట్టనున్న యూట్యూబ్ ప్రత్యక్ష ప్రసారాల పాటల సంగీత కార్యక్రమానికి సంబంధించి లోగోను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరిస్తామన్నారు. అనంతరం బాలసుబ్రహ్మణ్యం పాటలతో కూడిన సంగీత విభావరి నిర్వహిస్తామని తెలిపారు. సంగీత ప్రియులు పాల్గొనాలని కోరారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10
బెండకాయలు	36	కంద	40
పచ్చిమిర్చి	60	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	46	అల్లం	232
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	04
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	07
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	04
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	05
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందనలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ దంపతులు

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హనుమాయమ్మ మృతికి కారకులైన వారిని శిక్షించాలి

ఏలూరు (టూటౌన్) : ప్రకాశం జిల్లా అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మను ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వారిని కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె విజయలక్ష్మి,, నాయకురాలు పి.హైమావతి కోరారు. ఈమేరకు శుక్రవారం సాయంత్ర స్థానిక వసంత మహల్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాయమ్మ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలపై రాజకీయ కక్ష సాధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రజని, టి.సుకన్య, కె.కనకదుర్గ, జి.విజయలక్ష్మి, ఎం.రాజేశ్వరి, డి.దుర్గాదేవి, బి.విశాల, సీహెచ్ ఆందోళనమ్మ, ఎస్కే షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలి

ఏలూరు (టూటౌన్) : విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో స్మార్ట్ దోపిడీకి సిద్ధమైన కేంద్ర విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టేందుకు మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సన్నద్ధం కావాలన్నారు. జూన్‌నెలలో ఇచ్చిన విద్యుత్ బిల్లులలో విద్యుత్ వినియోగ ఛార్జీల కంటే మూడు రకాల సర్దుబాటు ఛార్జీలే ఎక్కువగా ఉన్నాయన్నారు. 2014 నుంచి నేటి వరకూ వినియోగించుకున్న విద్యుత్‌కు ఆనాడే బిల్లులు కట్టినా మళ్లీ, మళ్లీ వాటిపై ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమన్నారు.

చెరువుల అక్రమ తవ్వకాలను ఆపాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ఏలూరు (టూటౌన్) : జిల్లాలో చెరువుల అక్రమ తవ్వకాలను ఆపాలని, మట్టి అక్రమ తవ్వకాన్ని నిలిపివేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కోరింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌నందు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని కలిదిండి మండలం సీతారామ అగ్రహారంలో 7 ఎకరాలు మంచినీటి చెరువు పక్కన చేపల చెరువుగా తవ్వి నీటి కాలుష్యానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మండవల్లి మండలం కానుకూరు, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడలో పెరుగు లంక భూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. అక్రమ చెరువులు, మట్టి తవ్వకాలను నిరసిస్తూ పేదలు చేస్తున్న శాంతియుత ఆందోళనపై పోలీసులను ఉపయోగించడం దారుణమన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలకు కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రవి, పలువురు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలు స్థాపించే దిశగా విద్యార్థులు ఆలోచించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి రజిత

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పరిశ్రమలు స్థాపించే దిశగా విద్యార్థులు తమ ఆలోచనలను మార్చుకోవాలని, తద్వారా తాము ఉపాధి పొందుతూ పలువురు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం లభిస్తుందని పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ సుమధుర వాణి పిలుపునిచ్చారు. భారతదేశ జీ20 ప్రెసిడెన్సీలో భాగంగా నిర్వహిస్తున్న జన్ భాగీదరి కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో శుక్రవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే అంశంపై నిపుణులతో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమధుర వాణి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, పరిశ్రమల స్థాపనకు ఎన్నుకోవాల్సిన లక్షణాలను, స్థలాన్ని ఎంపిక చేసుకోవడం, అనుమతులు పొందడం, రాయితీ పొందడం గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్ మాట్లాడుతూ యువత వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తగిన లక్ష్యాలను నిర్ధేశించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.